# నమస్తే తెలంగాణ

# యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, మంగళవారం 4 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI





ఆరోరా ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద చేసిన ఏర్పాట్లు

నేడే పార్లమెంట్ ఓట్ల లెక్కింపు

# భువనగిరిలో గెలిచేదెవరో..!

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- అరోరా ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్
- తొలి రౌండ్ 8.40గంటలకు ప్రారంభం.. చివర రౌండ్ 3.30గంటలకు..
- ఎన్నికల బరిలో 39మంది అభ్యర్థులు
- కేంద్రం వద్ద మూడంచెల భద్రత
- నేడు మద్యం దుకాణాలు బంద్
- ఎటూ తేల్చని ఎగ్జిట్ పోల్ ఫలితాలు
- ఎవరు గెలుస్తారోనని అంతటా ఆసక్తి

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై నెల రోజుల ఉత్కంఠకు తెరపడనున్నది. భువనగిరి విజేత ఎవరో తేలిపోనుంది. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుండగా, అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే రెండు విడతలుగా ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఫలితాల నేపథ్యంలో మంగళవారం మద్యం దుకాణాలు బంద్ చేయనున్నారు. మరోవైపు ఎన్నికల ఫలితాల కోసం అభ్యర్థులు సహా అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

*– యాదాద్రి భువనగిరి, జూన్ 3 (నమస్తే తెలంగాణ)*

భువనగిరి లోక్‌సభ పరిధిలో భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల బరిలో 39 మంది అభ్యర్థులు నిలిచారు. గత నెల 13న పోలింగ్ జరగ్గా.. ఈవీఎంలను భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో అరోరా కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మంగళవారం ఉదయం 5.30గంటలకే కౌంటింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకోనున్నారు. పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతిస్తారు. లెక్కింపు ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభం కానున్నది. ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఓపెన్ చేస్తారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉంటారు. మొదట పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను ఓపెన్ చేస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఈవీఎం ఓట్లను ఏకకాలంలో లెక్కిస్తారు. మొదటి రౌండ్ ఫలితం ఉదయం 8.40గంటలకు, చివరి రౌండ్ ఫలితం మధ్యాహ్నం 3.30గంటలకు వెలువడే అవకాశం ఉంది. భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏడు కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. జనగాం, ఆలేరు, భువనగిరి, నకిరేకల్‌కు 14 టేబుళ్లు, మునుగోడు, తుంగతుర్తి 18 టేబుళ్లు, ఇబ్రహీంపట్నంలో 20టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రత్యేక హాల్ ఉంటుంది. ఆయా సెగ్మెంట్లలో పోలింగ్ బూత్‌లను అనుసరించి టేబుళ్లు, రౌండ్లను నిర్ణయించారు. ఈవీఎంలోని డేటా, వీవీప్యాట్లలోని సంఖ్యలను పోల్చి చూస్తారు. ఇవి కాకుండా ఇక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 14 టేబుళ్లు, సర్వీసు ఓటర్లకు 7 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. సర్వీసు ఓటర్లకు సంబంధించి స్కానింగ్ ద్వారా కౌంటింగ్ నమోదు చేస్తారు. అందు కోసం ఏడు టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. ఇక ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సుమారు 800మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు.



కౌంటింగ్ హాల్‌లో పూర్తయిన ఏర్పాట్లు

### మూడంచెల భద్రత..

అరోరా కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ వద్ద ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, వాటర్‌బాటిళ్లు, సిగరెట్లు, మద్యం తదితర వస్తువులను అనుమతించరు. కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులు మూడెంచల భద్రతను ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఫోర్స్‌తోపాటు రాష్ట్ర పోలీస్ బలగాలతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఐదురుగుకంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండొద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో మగళవారం మద్యం దుకాణాలు మూసివేయనున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు వైన్స్, బార్లు బంద్ చేయనున్నారు.

### ఎటూతేల్చని ఎగ్జిట్ పోల్స్

ఈ నెల ఒకటి చివరి దశ ఎన్నికలు ముగియడంతో అదే రోజు సాయంత్రం ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెలువడ్డాయి. అయితే దాదాపు అన్ని ఎంపీ స్థానాల్లో ఓ స్పష్టమైన అవగాహన వచ్చింది. భువనగిరిలో మాత్రం ఎగ్జిట్ పోల్స్‌లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. దాంతో ఎవరు గెలుస్తారని ఆసక్తికరంగా మారింది.



బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సునీత, శేఖర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నేత క్యామ

# కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

భువనగిరి అర్బన్, జూన్ 3 : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భువనగిరిలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సోమవారం జాతీయ జెండా, గులాబీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొంగిడి సునీత మాట్లాడుతూ ఉద్యమ రథసారథి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి 10 ఏండ్ల పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి బంగారు తెలంగాణగా రూపుదిద్దారన్నారు. మాయ మాటలు, దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలైనా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. ఉద్యమం అంటే ఏంటో తెలియని రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, జడల అమరేందర్ గౌడ్, కొలుపుల అమరేందర్, జడ్పీటీసీ బీరు మల్లయ్య, పార్టీ భువనగిరి పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్, మండలాధ్యక్షుడు జనగాం పాండు, నాయకులు పాల్గొన్నారు.

# మంచినీళ్ల ట్యాంకులో మృతదేహం

- నల్లగొండ పాతబస్తీ ట్యాంకులో వ్యక్తి మృతదేహం గుర్తింపు
- దుర్వాసన రావడంతో నీటి సరఫరా నిలిపివేసిన అధికారులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ చందనాదీప్తి
- విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర నియామకం

నీలగిరి, జూన్ 3 : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంకులో వ్యక్తి మృతదేహం కనిపించడం కలకలం రేపింది. ఆదివారం సాయంత్రం, సోమవారం ఉదయం ఆ ట్యాంకు పరిధిలోని నాలుగు వార్డుల ప్రజలకు సరఫరా అయిన నీటిలో దుర్వాసన రావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో మున్సిపల్ సిబ్బంది ట్యాంకులో పరిశీలించగా.. దుర్వాసన వస్తుండడంతో నీటిని ఖాళీ చేశారు. అడుగు భాగంలో మృతదేహం కనిపించగా.. బయటకు తీశారు. 12 రోజుల క్రితం తప్పిపోయిన అదే ప్రాంతానికి చెందిన అవుల వంశీకృష్ణ (27)గా స్థానికులు గుర్తించారు. వంశీకృష్ణ యాదవ్‌కు అనారోగ్య సమస్యతోపాటు మానసిక స్థితి సరిగా లేదని, గత నెల 24న రాత్రి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వంశీ అదే రోజు రాత్రి హిందూపూర్ వాటర్ ట్యాంకులో దూకి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మున్సిపల్ అధికారులు గుర్తించకపోగా ఆ ట్యాంకు నుంచి నాలుగు వార్డుల పరిధిలోని సుమారు రెండు వేల కుటుంబాలకు నీటిని సరఫరా చేశారు. కాగా, కొద్ది రోజుల నుంచి తాగునీరు తేడాగా ఉండడంతో 11వ వార్డు ప్రజలు వాటర్ సప్లయ్ సిబ్బందిని ప్రశ్నించారు. దాంతో మున్సిపాలిటీ సిబ్బంది, స్థానికులు వాటర్ ట్యాంకులో చెక్ చేయగా. వంశీకృష్ణ మృతదేహం లభ్యమైంది. మంచినీటి ట్యాంకులను చెక్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మున్సిపల్ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. అయితే.. మున్సిపాలిటీ అధికారులు మాత్రం మూడ్రోజుల కోసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నామని, అందులో భాగంగా మే 30న వాటర్ ట్యాంకును క్లీన్ చేశామని చెప్తున్నారు. రోజూ నీటిని విడుదల చేసే సమయంలో నీటి లెవల్స్ చూసి వదులుతామని చెప్పుకొచ్చారు. కానీ.. 10లక్షల కెపాసిటీ ఉన్న ట్యాంకు చాలా పెద్దగా ఉండడం, పైకప్పు చిన్నదిగా ఉండడంతో మృతదేహం కనబడటానికి వీలుండదని స్థానికులు పేర్కొంటున్నారు. వైద్య నిపుణులు మాత్రం మృతదేహం రెండు, మూడు రోజుల తరువాత పైకి లేచి కొంత సమయానికి మళ్లీ అడుగుకు పోతుందని, నీటిని పూర్తిగా తీయకుండా బ్లీచింగ్ చల్లడం వల్లే మృతదేహం వారికి కనబడక పోయి ఉండవచ్చని చెబుతున్నారు. కానీ.. గత నెల 24న ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వంశీ రెండు, మూడు రోజుల క్రితం చనిపోతే ఇన్ని రోజులు ఎక్కడ ఉన్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు మాత్రం అదే రోజు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని చెబుతున్నారు. నందికొండ మున్సిపాలిటీ వాటర్ ట్యాంకులో కోతులు పడి మృతి చెందిన ఘటన మరువక ముందే నల్లగొండలోని మంచినీటి ట్యాంకులో వ్యక్తి డెడ్‌బాడీని పది రోజులుగా పరిశీలించక పోవడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. కాగా, వాటర్ ట్యాంకులో వ్యక్తి మృతదేహం ఘటనపై జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన స్పందించారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు వెంటనే విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆమె ఆదేశించారు.



మృతదేహం లభించిన వాటర్ ట్యాంకు ఇదే

### సూర్యరశ్మి తగలకపోవడంతో మృతదేహం కుళ్లిపోలేదు

వంశీకృష్ణ 12 రోజుల క్రితం ట్యాంకులో పడి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని వైద్య నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు సామర్థ్యం 10లక్షల కెపాసిటీ కాగా.. నీరు వస్తుండడం, పోతుండడంతో పెద్దగా ప్రమాదం జరుగలేదు. ట్యాంకు లోపల చీకటిగా ఉండడం, మృతదేహనికి సూర్యరశ్మి తగలకపోవడంతో పాడై పోవడానికి చాలా రోజుల సమయం పడుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మృతదేహం కుళ్లిపోనందున మలినాలు బయటకు రాకపోయి ఉండవచ్చని చెబుతున్నారు.

### 50 ఇండ్లల్లో వైద్య పరీక్షలు

నీటిలో దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన జిల్లా యంత్రాంగం వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైద్యారోగ్య శాఖ అధికారులు నాలుగు వార్డుల పరిధిలోని సుమారు 50 ఇండ్లల్లోని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్యాల్లో ఎలాంటి మార్పులు లేకపోవడం, అన్ని పరీక్షల ఫలితాలు సాధారణంగా రావడంతో ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

### మే 30న వాటర్ ట్యాంకును శుభ్రం చేశాం

నల్లగొండ పాతబస్తీ ప్రాంతంలోని హిందుపూర్ వాటర్ ట్యాంకును సోమవారం శుభ్రం చేసేందుకు మున్సిపల్ ఏఈ, వాటర్ లైన్‌మన్ వెళ్లి ట్యాంకు తెరచి చూడగా మృతదేహం కనిపించింది. వెంటనే నీటిని తొలగించి శవాన్ని బయటకు తీశారు. ట్యాంకును రెండు, మూడు రోజులకు ఒకసారి శుభ్రం చేయడం జరుగుతుంది. ప్రతి మూడు రోజులకు సాధారణ శుభ్రత షెడ్యూల్ చేస్తాం. చివరగా మే 30న తనిఖీ చేసి జూన్ 1న నీటిని విడుదల చేశాం. అప్పుడు ఏమీ కనిపించలేదు. ప్రస్తుతం మృతదేహాన్ని వెలికి తీసి చూడగా రెండు, మూడు రోజుల క్రితం చనిపోయినట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. శరీరంపై కొన్ని గాయాలు కూడా ఉండడంతో ఇది ఆత్మహత్య, హత్య అనే కోణాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది.

*– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్*

### వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నాం : జిల్లా ఎస్పీ చందనాదీప్తి

వాటర్ ట్యాంకులో మృతదేహం విషయమై హత్య.. ఆత్మహత్యా? అనే దానిపై వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నాంమని జిల్లా ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. సోమవారం విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలన చేశారు. మృతదేహం పాతబస్తీ ప్రాంతానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించామని, రెండు, మూడు రోజుల క్రితం చనిపోయినట్లుగా ప్రాథమిక విచారణలో తెలిసిందని, మృతదేహంపై అక్కడక్కడ గాయాలున్నట్లు గుర్తించామని చెప్పారు.

### ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే

హిందూపూర్ వాటర్ ట్యాంకులో 11 రోజులుగా వ్యక్తి పడి ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకుండా దుర్వాసనతో నీటిని సరఫరా చేసి ప్రాణాలతో చెలగాటమాడారు. కలుషిత మంచినీరు తాగిన ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి. ట్యాంకులను శుభ్రం చేస్తూ.. వేసవిలో ఎప్పటికప్పుడు మంచినీటి సరఫరాపై సమీక్ష నిర్వహించవలసిన స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగింది. కలుషిత మంచినీరు తాగిన ప్రజలకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలి. బాధ్యులైన అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజల పక్షాన నిరసనలు చేపడుతాం.

*– మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి*

# జిల్లాలో మోస్తరు వాన

- అత్యధికంగా తుర్కపల్లిలో 47.3 మిల్లి మీటర్ల వర్షపాతం

భువనగిరి కలెక్టరేట్, జూన్ 3 : జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా తుర్కపల్లిలో 47.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. బొమ్మలరామారం మండలంలో 41.3 మి.మీ., రాజాపేటలో 35.5, బీబీనగర్‌లో 31, మోత్కూరు మండలం బుజిలాపురంలో 21, మోటకొండూరులో 17.8, అడ్డగూడూరులో 17.3, రామన్నపేట మండలం వెల్లంకిలో 16.5, చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో 15.5, భువనగిరి మండలం నందనంలో 15, గుండాలలో 14.5, ఆలేరు మండలం గొలనుకొండలో 13.3, సంస్థాన్ నారాయణపురం మండలం జనగాంలో 13, యాదగిరిగుట్టలో 9, వలిగొండలో 8, భూదాన్ పోచంపల్లిలో 7.8, ఆత్మకూరు(ఎం) మండలంలో 5.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# టీఎస్ పాలిసెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల సత్తా

- రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులు



శ్రీనిఖ (1)



విశ్వేశ్వర్ కుమార్ (12)



మనస్విని (18)



శ్రీచరణ్ తేజ (48)

రామగిరి, జూన్ 3 : ఇంజినీరింగ్ డిప్లమో కోర్సుల్లో చేరడానికి మే 24న నిర్వహించిన టీఎస్ పాలిసెట్-2024 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. నల్లగొండ జిల్లాలో ఎంపీసీ విభాగంలో 1,588 మంది బాలురు (82.54శాతం), 1,280 మంది బాలికలు (89.07 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఎంబైపీసీ విభాగంలో 1,540 మంది బాలురు (80.04 శాతం) 1,268 మంది బాలికలు (88.24 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సూర్యాపేట పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన గోపగాని శ్రీనిఖ ఎంబీసీసీలో 1వ ర్యాంకు, ఇదే జిల్లాలోని శ్రీరాంనగర్‌కు చెందిన రమావత్ మోక్షజ్ఞ 17వ ర్యాంకు సాధించారు. ఎంపీసీ విభాగంలో నల్లగొండ పట్టణానికి చెందిన రుద్ర విశ్వేశ్వర్‌కుమార్ రాష్ట్ర స్థాయి 12వ ర్యాంకు సాధించాడు. విశ్వేశ్వర్‌కుమార్‌కు తల్లిదండ్రులు రామకృష్ణ, సునీతతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ జి.పార్థసారధి, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అభినందనలు తెలిపారు. నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన చల్లా శ్రీచరణ్ తేజ ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 48వ ర్యాంకు సాధించాడు. దేవరకొండలోని ఎస్ ఐసీ కాలనీకి చెందిన గంద్ర మనస్విని ఎంబీపీసీ స్ట్రీమ్‌లో 18వ, ఎంపీసీలో 19వ ర్యాంకు సాధించింది. వలిగొండకు చెందిన గంజి సరస్వతి ఎంబీపీసీ స్ట్రీమ్‌లో 54వ ర్యాంకు సాధించింది. ఎంబీసీసీ విభాగంలో యాదాద్రి భువనగిరి జిల్లా సుద్దాలకు చెందిన గుండా దీక్షిత్‌గౌడ్ 43వ ర్యాంకు, భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన బింగి జోత్స్నశ్రీ 162వ ర్యాంకు, గుండాలకు చెందినే కస్తూరి వినయ్ 176వ ర్యాంకు సాధించారు.

# మండలి ఫలితం తేలేది ఇలా..

- రేపే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- నాలుగు కౌంటింగ్ హాల్స్.. ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లు
- మధ్యాహ్నం 2 గంటల వరకూ బండిల్స్ కార్యక్రమమే..
- ఆ తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఒక్కో రౌండ్‌లో 96వేల ఓట్ల కౌంటింగ్
- నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి
- చెల్లిన ఓట్లలోంచి గెలుపు కోటా నిర్ధారణ
- ఫలితం తేలకుంటే రెండో ప్రాధాన్యత కౌంట్
- చివరి నుంచి ఎలిమినేషన్ పద్ధతిలో ప్రక్రియ
- మొదటి ఓట్లకు కలుపుతూ కోటా వచ్చే వరకూ లెక్కింపు
- 48 గంటలకు పైగానే కౌంటింగ్ సమయం
- 2021లో 90 గంటల పాటు సాగిన లెక్కింపు




పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈవీఎంలు భద్రపర్చిన నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్ ఎదుట పోలీస్ బందోబస్తు

నల్లగొండ ప్రతినిధి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు బుధవారం ఉదయం 8గంటలకు మొదలు కానుంది. నల్లగొండ శివారులోని దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా ఈ ఎన్నికల్లో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి భిన్నంగా కొనసాగనుంది. ఓటింగ్‌లో ప్రాధాన్యతా ప్రకారం ఓటర్లు ఓటు వేయగా.. కౌంటింగ్ కూడా అదే విధంగా జరుగనుంది. తొలి ప్రాధాన్యత ఓట్లను మొదలు లెక్కించి ఆ సమయంలోనే చెల్లని ఓట్లను పక్కకు వేస్తారు. చెల్లిన ఓట్లను మాత్రమే పరిగణలోకి తీసుకుంటూ విజేతకు అవసరమైన కోటాను నిర్ణయిస్తారు. చెల్లిన ఓట్లల్లో యాభై శాతం ప్లస్ ఒకటి కలిపి విజేతకు అవసరమైన గెలుపు కోటాను నిర్ధారిస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్లలోనే ఈ గెలుపు కోటాను అభ్యర్థులు సాధిస్తే సరేసరి. లేకుంటే ఎలిమినేషన్ పద్ధతిలో సుదీర్ఘంగా గెలుపు కోటా వచ్చే వరకు లెక్కింపు కొనసాగనుంది.

### బండిల్ ప్రక్రియకు 6 గంటల సమయం

ఓట్ల లెక్కింపు సరిగ్గా రేపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం అవుతుంది. మొత్తం ఓటర్లలో 72.44శాతం ఓటింగ్‌తో మొత్తం 3,36,005 ఓట్లు పోలయ్యాయి. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగానే అధికారులు ముందుస్తుగానే కౌంటింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తం నాలుగు కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేశారు. ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లపై లెక్కింపు జరిగేలా చర్యలు చేపట్టారు. ఇలా మొత్తం కౌంటింగ్ కోసం 96 టేబుళ్లను వినియోగిస్తున్నారు. వీటిపై ముందుగా బ్యాలెట్ పత్రాలను కట్టలు కట్టే కార్యక్రమం చేపడుతారు. మొత్తం 605 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను వరుస క్రమంలో టేబుల్‌కు ఒకటి ఇచ్చి ఓపెన్ చేస్తారు. బ్యాలెట్ బాక్సుల్లోని బ్యాలెట్ పేపర్లను టేబుల్‌పై కుప్పగా పోసి 25 పేపర్లను ఒక కట్టగా చేసి బండిల్స్ చేస్తారు. ఇలా మొత్తం బ్యాలెట్ బాక్సులు ఓపెన్ చేసి కట్టలు కడుతారు. పోస్టల్ బ్యాలెట్లను కూడా ఇదే సమయంలో వీటితో కలిపేస్తారు. ఎప్పటికప్పుడు వీటన్నింటినీ తీసుకెళ్లి ఓ పెద్ద డ్రమ్ములో వేస్తారు. బండిల్ కార్యక్రమం పూర్తయ్యాక అసలు లెక్కింపు మొదలు కానుంది. అయితే.. ఈ బండిల్ కార్యక్రమానికే కనీసం ఐదు నుంచి ఆరు గంటల సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇది కొనసాగుతుండవచ్చని అంచనా. ఆ తర్వాతే అసలు ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. తొలి ప్రాధాన్యత ఓట్లను ముందుగా లెక్కిస్తారు.

### తొలి రౌండ్ ఫలితం సాయంత్రం 5గంటలకు..

అనుకున్న విధంగా మధ్యాహ్నం 2 గంటల వరకు బండిలింగ్ ప్రక్రియ ముగిస్తే.. తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపడుతారు. అయితే.. ఒక్కో టేబుల్‌కు 40 బండిల్స్ చొప్పున ఇస్తూ వెయ్యి ఓట్లను లెక్కిస్తారు. ఇలా మొత్తం 96 టేబుళ్లపై ఒక్కో రౌండ్‌లో 96వేల ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఇలా చేపట్టే తొలి రౌండ్ ఫలితం రేపు సాయంత్రం 5గంటల వరకు వెలువడవచ్చని అంచనా. మొత్తం నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఫలితాలు పూర్తిగా వెల్లడి కానున్నాయి. ఒక్కో రౌండ్‌కు సగటున రెండు గంటల సమయం పట్టవచ్చని అంచనా. ఇలా అర్ధరాత్రి 12గంటల వరకు తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి కావచ్చని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో మొత్తం 3,36,005 ఓట్లు పోలైన విషయం తెలిసిందే. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సమయంలోనే చెల్లని ఓట్లను కూడా వేరు చేస్తారు. చెల్లని ఓట్లను పక్కన వేసి చెల్లిన ఓట్ల నుంచే గెలుపు కోటాను నిర్ధారిస్తారు. మొత్తం చెల్లిన ఓట్లలో 50శాతం+1ను గెలుపు కోటాగా నిర్ధారిస్తారు. ఉదాహరణకు మొత్తం ఓట్లల్లో 3లక్షలు చెల్లుబాటైతే అందులో సగం అంటే 1,50,000+1 = 1,50,001 ఓట్లు వచ్చిన అభ్యర్థి విజేత అవుతారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికీ గెలుపు కోటా రాకపోతే అప్పుడు ఎలిమినేషన్ ప్రక్రియ మొదలవుతుంది.

### 2021లో 90గంటల పాటు సాగిన కౌంటింగ్

2021 మార్చిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది. నల్లగొండ పరిధిలోని ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాములలో 17న ఉదయం 8గంటలకు లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అదే రోజు సాయంత్రం 5 గంటల వరకు 25 ఓట్లకు ఒక కట్టను కట్టే కార్యక్రమం కొనసాగింది. తర్వాత ఆరు గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్లను లెక్కించడం మొదలు పెట్టారు. 19వ తేదీన తెల్లవారుజామున 4గంటల వరకు మొత్తం 34గంటల పాటు ఇదే కొనసాగింది. గెలుపు కోటా ఎవరికీ రాకపోవడంతో అక్కడి నుంచి ఎలిమినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. 19న ఉదయం ఐదు గంటల నుంచి మొత్తం 71 మందిలో ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. ఈ కార్యక్రమం కూడా సుదీర్ఘ సమయాన్ని తీసుకుంది. 20వ తేదీ రాత్రి 12గంటల వరకు సుమారు 44గంటల పాటు కొనసాగింది. ఇలా మొత్తం 90గంటలకు పైగా రికార్డు సుదీర్ఘ సమయం తీసుకుంది. అయితే అప్పుడు ఒక్కో రౌండ్‌లో 56టేబుళ్లపై 56వేల ఓట్లే లెక్కించారు. కానీ.. ప్రస్తుతం ఒక్కో రౌండ్‌లో 96 టేబుళ్లపై 96వేల ఓట్లు లెక్కించనుండడంతో ఈ సారి 48గంటల్లోనే ఫలితం తేలనుందని అంచనా వేస్తున్నారు.

### తొలి ప్రాధాన్యత ఓట్లతో విజేత తేలకుంటే..

తొలి ప్రాధాన్యత ఓట్లతో విజేత తేలకుంటే ఎలిమినేషన్ ప్రక్రియ చేపడుతారు. ఇది విభిన్నంగా కొనసాగనుంది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించే సమయంలో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఎవరికైతే తక్కువ తొలి ప్రాధాన్యత ఓట్లు వస్తాయో.. వారి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ముందుగా లెక్కించి ఆ అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తారు. తొలి ఓట్లలో చివరి స్థానంలో నిలిచిన అభ్యర్థికి పోలైన ద్వితీయ ఓట్లు.. ఏ అభ్యర్థులు పొందినవి వారికి కేటాయిస్తారు. ఇంకా కూడా కోటా రాకపోతే చివరి తక్కువ తొలి ప్రాధాన్యత వచ్చిన రెండో అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పరిగణలోకి తీసుకుని మిగతా వారికి పంచేస్తారు. ఆయా అభ్యర్థుల తొలి ప్రాధాన్యత ఓట్లకు ఎలిమినేషన్ ప్రక్రియలో వస్తున్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కులుపుకొంటూ ముందుకు వెళుతారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో గెలుపు కోటా వచ్చే వరకు కింది నుంచి పైకి అందరి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తూ వెళ్తారు. ఈ క్రమంలో ఎక్కడైనా ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడితో కౌంటింగ్‌ను నిలిపివేసి విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ ఇక్కడ కూడా ఫలితం తేలకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను కూడా లెక్కించక తప్పదు. మళ్లీ ద్వితీయ ఓట్లు లెక్కించిన తరహాలోనే ఈ ప్రక్రియ సాగుతుంది. కాకపోతే ఇప్పటి వరకు తొలి ప్రాధాన్యతలో తేలకపోతే ద్వితీయ ప్రాధాన్యతతో గెలుపు సాధించిన సంఘటనలే ఉన్నాయి. తృతీయ ప్రాధాన్యత వరకు లెక్కింపు వెళ్లిన దాఖలాలు లేవని తెలుస్తోంది.

### కౌంటింగ్‌కు సర్వం సిద్ధం : ఆర్‌ఓ హరిచందన

పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు. బుధవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. కౌంటింగ్ కోసం ఇప్పటికే సిబ్బంది నియామకం, శిక్షణ, లెక్కింపునకు అవసరమైన సామగ్రి సిద్ధం చేసినట్లు చెప్పారు. లెక్కింపు ప్రారంభంలో బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేసి 25చొప్పున కట్టలు కట్టి.. తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలవుతుందని తెలిపారు. ఆ తర్వాత కోటా నిర్ధారించి గెలుపు కోటా వచ్చే వరకు ఎలిమినేషన్ ప్రక్రియలో కౌంటింగ్ కొనసాగిస్తామన్నారు. అందుకు అనుగుణంగానే షిఫ్టుల వారీగా సిబ్బందిని విభజించి విధులు కేటాయించినట్లు తెలిపారు. కౌంటింగ్‌ను పూర్తి పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా చేపట్టేందుకు సర్వం సిద్ధంగా ఉన్నామన్నారు.